# నేను అండగా ఉన్నా

- ఎల్ఎస్‌డీఎస్ఎస్‌కీ కార్తీ భరోసా
- భారీగా విరాళం
- వ్యాధుల గురించి భయపడొద్దు



ఎల్ఎస్‌డీ బాలలకు చెక్కులను అందజేస్తున్న కార్తీ

అన్నానగర్, న్యూస్‌లైన్:

చిన్నతనంలోనే అనేక వ్యాధులకు గురి అవుతున్న పిల్లలకు తాను అండగా ఉన్నానని నటుడు కార్తీ శివకుమార్ ప్రకటించారు. ఏటా మార్చిలో 20వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే 'అరుదైన వ్యాధులపై అవగాహన' అనే కార్యక్రమానికి ఆయన గురువారం ముఖ్యఅతిథిగానూ, లైసోజోమల్ స్టోరేజీ డిజార్డర్ సపోర్ట్ సొసైటీకి బ్రాండ్ అంబాసిడర్‌గాను పాల్గొన్నారు. దేశంలో రెండు వేల మందికిపైగా పిల్లలు ఎల్ఎస్‌డీఎస్ఎస్ వ్యాధితో బాధపడుతున్నారని, ఇందులో 600 మంది మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన భారీ విరాళాన్ని సంస్థకు అందించారు. ఎల్ఎస్‌డీఎస్ఎస్ సంస్థలోని పిల్లలకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను వేశారు. ఎల్ఎస్‌డీఎస్ఎస్ సంస్థ అధ్యక్షుడు మంజిత్ సింగ్ తనదికాని రాష్ట్రంలో పిల్లలకు విశిష్టమైన సేవలు అందిస్తున్నందుకు ఆయన్ను అభినందించి సత్కరించారు.సంస్థలోని వైద్యులు డాక్టర్ సుజాత జగదీష్, డాక్టర్ ఇంద్రాణీ సురేష్ ఈ వ్యాధితో బాధపడుతున్న పిల్లల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయరని మంజిత్‌సింగ్ తెలిపారు. తమ సంస్థకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్ ఎంతగానో సాయం చేస్తున్నారన్నారు. తమ సంస్థకు మైలాపుర్‌లోని పీటర్ కేర్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకరిస్తోందన్నారు. ఎల్ఎస్‌డీ వ్యాధితో ప్రతి అవయవమూ తన అసలు సైజుకంటే ఎక్కువగా కానీ, అతి తక్కువగా కానీ పెరుగుతుందని, ఇందువల్ల శరీర కదలికల్లో సక్రమత కన్పించదని డాక్టర్ ఇంద్రాణీ తెలిపారు. ఎల్ఎస్‌డీఎస్ఎస్ చెన్నై విభాగం ఏటా రెండు వేల మంది ఎల్ఎస్‌డీ వ్యాధిగ్రస్తులకు ఆర్థిక, వైద్యసాయాలు అందించాలనే తలంపుతో పనిచేస్తోందని పీటర్ కేర్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ సుజాత తెలిపారు. అనంతరం నటుడు కార్తీ ఎల్ఎస్‌డీ వ్యాధి సోకిన పిల్లలతో కొంతసేపు ముచ్చటించారు. వారితో ఒక గ్రూపు ఫొటో తీయించుకున్నారు.